RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | ఆదివారం, అక్టోబరు 25, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 167 | పేజీలు: 8 | వెల : రూ.1

ద్వితీయ శ్రేణి నగరాల్లోకి క్విక్ కామర్స్

మందకొడిగా పట్టభద్రుల ఓటర్ల నమోదు

హైదరాబాద్‌లో ఆశించిన స్పందన కరువు.. నల్గొండ-ఖమ్మం-వరంగల్‌లో జోరు

నవంబర్ 6తో ముగియనున్న గడువు.. రాజకీయ పార్టీల నిర్లక్ష్యంపై విమర్శలు

హైదరాబాద్, అక్టోబరు 24: తెలంగాణలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ, ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదు. ముఖ్యంగా చదువుకున్న నిరుద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, ఐటీ నిపుణులు అధికంగా ఉండే హైదరాబాద్ ప్రాంతంలో నమోదు మందకొడిగా సాగుతోంది. దీనికి భిన్నంగా నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గంలో దరఖాస్తుల సంఖ్య గణనీయంగా ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. నవంబర్ 6తో ఓటర్ల నమోదు గడువు ముగియనుండటంతో రాజకీయ పార్టీల్లో ఆందోళన మొదలైంది.

రెండు నియోజకవర్గాల మధ్య వ్యత్యాసం

ప్రస్తుతం అందిన గణాంకాల ప్రకారం హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో 1,91,360 దరఖాస్తులు అందగా, నల్గొండ--ఖమ్మం--వరంగల్ నియోజకవర్గంలో 2,44,349 దరఖాస్తులు వచ్చాయి. హైదరాబాద్ నియోజకవర్గ పరిధిలో రంగారెడ్డి జిల్లాలో 53,491, మేడ్చల్‌లో 37,364, హైదరాబాద్‌లో 22,535, వికారాబాద్‌లో 15,020 దరఖాస్తులు నమోదయ్యాయి. ఇక నల్గొండ--ఖమ్మం--వరంగల్ నియోజకవర్గంలో నల్గొండ జిల్లాలో 46,038, సూర్యాపేటలో 31,512, ఖమ్మంలో 37,848 దరఖాస్తులు అందాయి. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ మంది విద్యావంతులు ఉన్నప్పటికీ హైదరాబాద్‌లో నమోదు ఆశించిన స్థాయిలో లేకపోవడం గమనార్హం.

పార్టీలకు పట్టని పట్టభద్రుల ఓటు

2021 ఓటర్ల జాబితాతో పోలిస్తే అప్పట్లో హైదరాబాద్ నియోజకవర్గంలో 5.31 లక్షలు, నల్గొండ నియోజకవర్గంలో 5.05 లక్షల మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. అయితే ప్రస్తుతం వెల్లడైన గణాంకాలు అందిన దరఖాస్తులకు సంబంధించినవేనని, పరిశీలన అనంతరం తుది ఓటర్ల సంఖ్యలో మార్పులు ఉండవచ్చని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఓటర్ల నమోదు మందకొడిగా సాగడానికి రాజకీయ పార్టీల నిర్లక్ష్యం కూడా ఒక కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థల రాజకీయాలపై దృష్టి సారిస్తున్న పార్టీలు పట్టభద్రుల ఓటర్ల నమోదును పెద్దగా పట్టించుకోవడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బూత్ స్థాయి నుంచి పట్టభద్రులను గుర్తించి దరఖాస్తులు చేయించే కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

ఐటీ ఉద్యోగుల్లోనూ అవగాహన లోపం

హైదరాబాద్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన ఐటీ నిపుణులు, ప్రైవేటు ఉద్యోగులు, ఉన్నత విద్యావంతులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అయినప్పటికీ ఓటరు నమోదుకు అవసరమైన అర్హతలు, ధ్రువీకరణ పత్రాలు, దరఖాస్తు విధానంపై సరైన అవగాహన లేకపోవడం కూడా నమోదుపై ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా అర్హత ఉన్నప్పటికీ పలువురు పట్టభద్రులు ఓటు హక్కుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోంది.

గడువు సమీపిస్తున్నా కదలిక ఏది?

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారనున్నాయి. మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగుల మద్దతు తమకు ఉందని నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను పార్టీలు కీలకంగా భావిస్తాయి. అలాంటి ఎన్నికల్లో ఓటర్ల నమోదుపై నిర్లక్ష్యం వహించడం ఆయా పార్టీలకే నష్టం కలిగించే ప్రమాదం ఉంది. నవంబర్ 6 గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికైనా మేల్కొని అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పిస్తాయా? హైదరాబాద్‌లో నమోదు ప్రక్రియకు ఊపునిస్తాయా? లేక చివరి నిమిషంలో హడావుడికే పరిమితమవుతాయా? అన్నది వేచి చూడాలి.

తెలంగాణలో కరువు నివారణకు రూ.150 కోట్లతో శాశ్వత చర్యలు

3 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: తెలంగాణలో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు మూడు మండలాల్లో రూ.150 కోట్లతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్, నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల, నారాయణపేట జిల్లా మక్తల్ మండలాలను ఇందుకోసం ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ నిధి (NDF) సహకారంతో నీటి వనరుల సమర్థ వినియోగం, రైతుల జీవనోపాధి మెరుగుదల లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, విపత్తు నిర్వహణ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. ఎంపిక చేసిన మండలాల్లో గ్రామసభలు నిర్వహించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో గ్రామ, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు నిధులను పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వినియోగిస్తూ కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విపత్తు నిర్వహణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎన్. గోపి తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు

ఆదివారం, అక్టోబరు 25, 2026

ద్వితీయ శ్రేణి నగరాల్లోకి క్విక్ కామర్స్

టైర్-2, టైర్-3 పట్టణాలపై లాజిస్టిక్స్ దిగ్గజాల దృష్టి

హైవేల పక్కన భారీగా భూముల సమీకరణ.. రియల్ ఎస్టేట్‌కు కొత్త ఊపు

కర్నూలు, అక్టోబరు 24: క్విక్ కామర్స్ రంగం వేగంగా విస్తరిస్తుండటంతో లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్ సంస్థలు తమ వ్యాపార వ్యూహాలను మార్చుకుంటున్నాయి. ఇప్పటివరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై వంటి మెట్రో నగరాలకే ప్రధానంగా పరిమితమైన ఈ సంస్థలు ఇప్పుడు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలపై దృష్టి సారిస్తున్నాయి. ఆయా నగరాల పరిసరాల్లో భారీ స్థాయిలో భూములను సమీకరించడంతోపాటు, జాతీయ రహదారులకు సమీపంలో గోదాములు, పంపిణీ కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి.

హైవేల పక్కన భూములకు గిరాకీ

ఈ కొత్త వ్యూహంలో జాతీయ రహదారుల జంక్షన్లు, పారిశ్రామిక కారిడార్లు కీలకంగా మారుతున్నాయి. వరంగల్, కరీంనగర్, నల్గొండ, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు వంటి పట్టణాల బైపాస్ రోడ్లకు సమీపంలోని భూములకు డిమాండ్ పెరుగుతోంది. మెరుగైన రవాణా సదుపాయాలు, మెట్రో నగరాలతో పోలిస్తే తక్కువ ధరకు భూముల లభ్యత, స్థానికంగా అందుబాటులో ఉండే కార్మిక శక్తి ఈ ప్రాంతాలను లాజిస్టిక్స్ సంస్థలకు ఆకర్షణీయంగా మారుస్తున్నాయి. దీంతో భూములను దీర్ఘకాలిక లీజుకు తీసుకోవడం, డెవలప్‌మెంట్ ఒప్పందాలు కుదుర్చుకోవడంపై సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి.

కొన్ని గంటల్లోనే డెలివరీ లక్ష్యం

టైర్-2, టైర్-3 నగరాల్లోనూ వినియోగదారులకు అదే రోజు లేదా కొన్ని గంటల్లోనే వస్తువులను అందించాలన్నది క్విక్ కామర్స్ సంస్థల ప్రధాన లక్ష్యం. ఇందుకోసం ప్రాంతీయ పంపిణీ కేంద్రాలు, ఆధునిక గ్రేడ్-ఏ వేర్‌హౌసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని భావిస్తున్నాయి. నగరాలకు సమీపంలో నిల్వ కేంద్రాలు అందుబాటులో ఉంటే సరుకుల రవాణా సమయం తగ్గడంతోపాటు, సప్లై చైన్ నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

రియల్ ఎస్టేట్‌కు కొత్త ఊపు

లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్ రంగాల నుంచి పెరుగుతున్న డిమాండ్ ద్వితీయ, తృతీయ శ్రేణి

నగరాల పరిసర ప్రాంతాల రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా జాతీయ రహదారుల పక్కన ఉన్న వ్యవసాయ భూములు, పారిశ్రామిక అవసరాలకు అనువైన స్థలాలకు వాణిజ్యపరమైన ప్రాధాన్యత పెరుగుతోంది. దీర్ఘకాలిక లీజుల ద్వారా భూ యజమానులకు క్రమమైన ఆదాయం లభించే అవకాశాలు ఏర్పడుతున్నాయి.

స్థానికంగా ఉపాధి అవకాశాలు

ఈ పరిణామాలతో గోదాముల నిర్వహణ, రవాణా, ప్యాకేజింగ్, సరుకు పంపిణీ వంటి రంగాల్లో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో చిన్న పట్టణాల్లో వాణిజ్య కార్యకలాపాలు విస్తరించి, ఆర్థిక చైతన్యం పెరగవచ్చని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా క్విక్ కామర్స్ విస్తరణ ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల ఆర్థిక ముఖచిత్రంతోపాటు రియల్ ఎస్టేట్ రంగంలోనూ కొత్త మార్పులకు నాంది పలుకుతోంది.

టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుంది: మంత్రి పొన్నం ప్రభాకర్

నామినేటెడ్, న్యాయపరమైన పదవుల్లో అవకాశాలు కల్పిస్తాం

హైదరాబాద్ (వాయిస్ టుడే): టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో న్యాయవాదుల పాత్ర మరువలేనిదని అన్నారు. న్యాయవాదుల వృత్తి ప్రత్యేకమైనదని, 2023లో ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి రావడంలో కూడా న్యాయవాదులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, తోటి న్యాయవాది సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన న్యాయవాదులకు సముచిత గుర్తింపు, న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో జరిగిన నియామకాల తరహాలోనే కాంగ్రెస్ అనుబంధ న్యాయవాదులకు కూడా తగిన అవకాశాలు కల్పించాల్సి ఉందని తెలిపారు.

పార్టీ, ప్రభుత్వానికి లీగల్ సెల్ అండగా ఉండాలి

తెలంగాణలోని 33 జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ఉన్నాయని, ఆయా కార్యాలయాల్లో పార్టీకి సంబంధించిన న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి న్యాయవాదులు అండగా నిలవాలని మంత్రి కోరారు. ప్రభుత్వానికి సంబంధించిన న్యాయపరమైన అంశాల్లోనూ లీగల్ సెల్ సహకారం అందించాలని సూచించారు. పార్టీ కార్యకర్తలకు న్యాయపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు వారికి రక్షణగా నిలవాలని అన్నారు. న్యాయవాదులకు నామినేటెడ్ పోస్టుల్లో బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఎల్కతుర్తి వంటి ప్రాంతాల్లో సైతం ప్రభుత్వం కోర్టులను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. న్యాయపరమైన పదవుల్లో అర్హులైన కాంగ్రెస్ పార్టీ న్యాయవాదులకు అవకాశాలు కల్పించడం, ప్రభుత్వానికి న్యాయ సలహాలు అందించడం, న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని చెప్పారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కల్పించే అంశాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు.. టీడీపీ దారెటు?

ఎన్డీయే పార్టీల మధ్య సమన్వయంపై ఉత్కంఠ

జనసేన అభ్యర్థి ప్రకటన.. బీజేపీ కసరత్తు.. టీడీపీ నిర్ణయంపై ఆసక్తి

నల్గొండ, అక్టోబరు 24: తెలంగాణ రాజకీయాల్లో 2027 మార్చిలో జరగనున్న వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమిగా కొనసాగుతున్న టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు తెలంగాణలో మాత్రం వేర్వేరు రాజకీయ వ్యూహాలతో ముందుకు సాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ ఎలాంటి వైఖరి అవలంబిస్తుందన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో మూడు పార్టీలు కలిసి అధికారాన్ని పంచుకుంటున్నప్పటికీ తెలంగాణలో మాత్రం వాటి మధ్య అధికారిక పొత్తు లేదు. దీంతో వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోటీ చేసేందుకు ఆయా పార్టీలు సొంతంగా వ్యూహాలు రచిస్తున్నాయి. ఇప్పటికే జనసేన ఈ స్థానంపై దృష్టి సారించి, తమ పార్టీ అభ్యర్థిగా గడల శ్రీనివాసరావును ప్రకటించింది. మరోవైపు బీజేపీ కూడా బలమైన అభ్యర్థిని బరిలోకి దింపేందుకు కసరత్తు చేస్తోంది. ఆ పార్టీ తరఫున పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

టీడీపీ మద్దతు ఎవరికి?

బీజేపీ, జనసేన రెండూ పోటీకి సిద్ధమవుతున్న తరుణంలో టీడీపీ వైఖరి కీలకంగా మారింది. తెలంగాణలో టీడీపీకి ఇప్పటికీ కొంతమేర క్యాడర్, ఓటు బ్యాంకు ఉండటంతో ఆ పార్టీ మద్దతు ఎవరికి లభిస్తుందన్న అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ ఎన్నికల్లో పోటీ చేసే విషయంపై గానీ, మిత్రపక్షాల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే అంశంపై గానీ టీడీపీ ఇప్పటివరకు అధికారికంగా స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఓట్ల చీలిక తప్పదా?

టీడీపీ ఒక పార్టీకి మద్దతు ప్రకటిస్తే ఆ అభ్యర్థికి అదనపు బలం చేకూరే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా పట్టభద్రుల ఓటర్లలో ప్రభావం చూపగలిగే వర్గాల మద్దతు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయవచ్చు. అదే సమయంలో టీడీపీ తటస్థంగా ఉండటం లేదా తనదైన వ్యూహంతో ముందుకు సాగడం జరిగితే బీజేపీ, జనసేన మధ్య ఓట్ల చీలికకు అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి సమన్వయానికి పరీక్ష!

మొత్తంగా 2027 మార్చిలో జరగనున్న ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మూడు పార్టీల రాజకీయ వ్యూహాలకు పరీక్షగా నిలవనున్నాయి. ఏపీలో బలమైన మిత్రపక్షాలుగా ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన తెలంగాణలోనూ సమన్వయంతో పనిచేస్తాయా? లేక స్థానిక రాజకీయ ప్రయోజనాల కోసం వేర్వేరు దారుల్లోనే పయనిస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. జనసేన ముందుగానే అభ్యర్థిని ప్రకటించగా, బీజేపీ అభ్యర్థి ఎంపికపై దృష్టి సారించింది. ఈ పరిస్థితుల్లో టీడీపీ అధిష్ఠానం తీసుకోబోయే నిర్ణయం ఎన్నికల సమీకరణాలను ఏ మేరకు ప్రభావితం చేస్తుందో వేచి చూడాల్సిందే.

పాదరసాన్ని బంగారంగా మార్చేశాం.. అమెరికా స్టార్టప్ సంచలన ప్రకటన!

శతాబ్దాలుగా రసవాదులు కన్న కల... పనికిరాని లోహాలను విలువైన బంగారంగా మార్చాలన్న ఆశయం... సైన్స్ ఫిక్షన్ కథల్లో చదివిన అద్భుతం... ఇప్పుడు వాస్తవరూపం దాల్చింది. శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన 'మ్యారథాన్ ఫ్యూజన్' అనే స్టార్టప్, అణు సంలీన టెక్నాలజీని ఉపయోగించి పాదరసాన్ని స్థిరమైన బంగారంగా మార్చినట్టు ప్రకటించి సంచలనం సృష్టించింది. తాము సాధించిన ఈ ప్రక్రియను 'హై-రేట్ ఆల్కెమీ'గా అభివర్ణించిన ఈ సంస్థ, ప్రపంచ ప్రఖ్యాత పరిశోధన సంస్థ 'సెర్న్' రికార్డును సైతం 10 రెట్లు అధిగమించామని చెబుతోంది. రసాయనిక పద్ధతులతో ఒక మూలకాన్ని మరో మూలకంగా మార్చడం అసాధ్యం. కానీ, అణు కేంద్రకంలో మార్పులు తీసుకురావడం ద్వారా ఇది సాధ్యమేనని శాస్త్రవేత్తలు ఎప్పుడో నిరూపించారు. ఈ ప్రక్రియనే 'న్యూక్లియర్ ట్రాన్స్‌మ్యూటేషన్' అంటారు. మ్యారథాన్ ఫ్యూజన్ సరిగ్గా ఇదే చేసింది. గత నెలలో జరిగిన ప్రయోగంలో, డ్యూటీరియం-ట్రిటియం అనే ఇంధనాలను ఉపయోగించి అణు సంలీన చర్యను ప్రారంభించారు. ఈ చర్యలో అత్యధిక శక్తి కలిగిన న్యూట్రాన్లు పుట్టుకొస్తాయి. ఈ న్యూట్రాన్లను పాదరసం ప్రత్యేక ఐసోటోప్ అయిన మెర్క్యురీ-198పైకి ప్రసరింపజేశారు. దీనివల్ల అది రేడియోధార్మికత కలిగిన మెర్క్యురీ-197గా మారింది. ఈ ఐసోటోప్ సుమారు 64 గంటల వ్యవధిలో సహజంగా క్షీణించి, స్థిరమైన గోల్డ్-197గా రూపాంతరం చెందింది. అలా పాదరసం కాస్తా మేలిమి బంగారంగా మారిపోయింది. నిజానికి ఇలా ఒక మూలకాన్ని మరో మూలకంగా మార్చడం ఇదే మొదటిసారి కాదు. 2025లో సెర్న్‌లోని లార్జ్ హాడ్రాన్ కొలైడర్‌లో సీసం నుంచి సుమారు 29 పికోగ్రాముల (ఒక గ్రాములో లక్ష కోట్ల వంతు) బంగారం ఉత్పత్తి అయినట్టు ప్రకటించారు. అయితే, మ్యారథాన్ ఫ్యూజన్ తమ ఉత్పత్తి రేటు దానికంటే 10 రెట్లు ఎక్కువని చెబుతోంది.

జాతీయ రాజకీయాల్లోకి కేసీఆర్.. కమ్‌బ్యాక్ సాధ్యమేనా?

మళ్లీ ఢిల్లీ రాజకీయాలపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

కాంగ్రెస్, బీజేపీయేతర కూటమికి కేసీఆర్ నాయకత్వం వహిస్తారా?

తెలంగాణలో పార్టీ పునాదులు బలపరచకుండా జాతీయ రాజకీయాలెందుకు?

హైదరాబాద్, అక్టోబర్ 24 (వాయిస్ టుడే): తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ జాతీయ రాజకీయాల చర్చ మొదలైంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలోనే జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించబోతున్నారంటూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపాయి. తెలంగాణ భవన్‌లో అంబర్‌పేట నియోజకవర్గ నాయకులతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బలహీనపడుతోందని, కాంగ్రెస్ వైఫల్యాల నేపథ్యంలో దేశంలో కాంగ్రెస్, బీజేపీయేతర రాజకీయ శక్తుల అవసరం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ పార్టీలను ఏకం చేయడంలో కేసీఆర్ మరోసారి కీలక పాత్ర పోషిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అయితే, గత రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి తిరిగి ప్రవేశించడం అంత సులభం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నుంచి ఎదిగిన నాయకుడిగా కేసీఆర్‌కు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. కానీ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేసిన తర్వాత పార్టీకి తెలంగాణలోనే ఎదురుదెబ్బలు తగిలాయి.

జాతీయ రాజకీయాలే ఓటమికి కారణమా?

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి జాతీయ రాజకీయాలపై అధికంగా దృష్టి పెట్టడం కూడా ఒక కారణమన్న విశ్లేషణలు అప్పట్లో వెలువడ్డాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం జాతీయ రాజకీయాల వ్యూహంపై గతంలో పలు సందర్భాల్లో సమీక్షాత్మక వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడం వల్ల తెలంగాణ ప్రజల మనోభావాలకు పార్టీ దూరమైందన్న విమర్శలు కూడా వినిపించాయి. పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఒక్క లోక్‌సభ స్థానాన్ని గెలుచుకోలేకపోవడం పార్టీ పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. దీంతో

పాత తెలంగాణ సెంటిమెంట్‌ను తిరిగి ముందుకు తెచ్చినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఈ నేపథ్యంలో మళ్లీ జాతీయ రాజకీయాలపై కేసీఆర్ దృష్టి సారిస్తారన్న కేటీఆర్ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.

ముందు తెలంగాణలో పట్టు సాధించాలి!

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్‌కు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం ప్రధాన సవాలుగా మారింది. రైతులు, నిరుద్యోగులు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రధాన ప్రతిపక్షంగా తన బాధ్యతను సమర్థంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ సమయంలో ఇతర రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణాలు, జాతీయ కూటముల నిర్మాణంపై దృష్టి పెట్టడం పార్టీకి ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను రాష్ట్ర ఉద్యమ నాయకుడిగా, తెలంగాణ రాజకీయాల్లో కీలక నేతగా ఆదరించారు. అయితే జాతీయ స్థాయిలో ఆయనకు ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు ఎంతవరకు లభిస్తుందనేది కీలకం. గతంలో బీఆర్ఎస్ పేరుతో దేశవ్యాప్తంగా రాజకీయ విస్తరణకు ప్రయత్నించినప్పటికీ ఆశించిన ప్రభావం చూపలేకపోయింది. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని మళ్లీ అమలు చేయడం ఎంతవరకు సాధ్యమన్నది ప్రశ్నార్థకంగా మారింది.

థర్డ్ ఫ్రంట్ సాధ్యమేనా?

కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి ఏర్పాటు చేయాలంటే దేశంలోని ప్రధాన ప్రాంతీయ పార్టీల మద్దతు అవసరం. ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల మధ్య భిన్నమైన రాజకీయ ప్రయోజనాలు, రాష్ట్రాల వారీగా మారుతున్న పొత్తులు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ నాయకత్వంలో మూడో కూటమి ఏర్పాటుకు ఎంతమంది నేతలు ముందుకొస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు, బీఆర్ఎస్ జాతీయ రాజకీయాల పేరుతో రాష్ట్రంలో ఎదురవుతున్న సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ ఉనికిని కాపాడుకోవాల్సిన సమయంలో జాతీయ స్థాయి రాజకీయాలపై ప్రకటనలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని ప్రత్యర్థులు అభిప్రాయపడుతున్నారు.

కేసీఆర్ వ్యూహం ఏమిటి?

కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి తిరిగి ప్రవేశిస్తారన్న ప్రకటన వెనుక తెలంగాణలో పార్టీ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలన్న వ్యూహం కూడా ఉండవచ్చన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాబోయే ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడం కేటీఆర్ వ్యాఖ్యల వెనుక మరో ఉద్దేశంగా కనిపిస్తోంది. అయితే కేసీఆర్ నిజంగానే ఢిల్లీ రాజకీయాలపై దృష్టి సారిస్తారా? ఇతర రాష్ట్రాల ప్రాంతీయ పార్టీల నేతలతో సమావేశమై కొత్త కూటమి ఏర్పాటుకు ప్రయత్నిస్తారా? లేక తెలంగాణ రాజకీయాలకే పరిమితమవుతారా? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగితేనే బీఆర్ఎస్‌కు రాజకీయంగా ప్రయోజనం చేకూరుతుంది. రాష్ట్రంలో కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి సంపాదించకుండా జాతీయ రాజకీయాల్లో పట్టు సాధించడం అంత సులభం కాదన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. కేటీఆర్ చేసిన ప్రకటన ఆచరణలోకి వస్తుందా? లేక మరో రాజకీయ వ్యూహంగానే మిగిలిపోతుందా? అన్నది వేచి చూడాలి.

మాట ఇచ్చారు... మాట నిలబెట్టుకున్నారు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 24(వాయిస్ టుడే): శిల్పా ఫైన్ వ్యాలీ కాలనీ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు.గత కొన్ని సంవత్సరాలుగా మన శిల్పా ఫైన్ వ్యాలీ కాలనీలో రోడ్ల పరిస్థితి ఎంత దారుణంగా ఉండేదో మనందరికీ తెలుసు. గర్భిణీ స్త్రీలు రోడ్లపై నడవడానికి ఇబ్బందులు పడటం, వృద్ధులు బయటకు రావడానికి భయపడటం, చిన్నారులు స్కూల్‌కు వెళ్లడానికి అవస్థలు పడటం... వర్షాకాలం వచ్చిందంటే పరిస్థితి మరింత దయనీయంగా మారేది. మన కాలనీ పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా కూడా ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాము.డ్రైనేజీకి ప్రస్తుతం ఫీజిబిలిటీ లేదని తెలిసినప్పటికీ, కనీసం మన కాలనీకి మంచి రోడ్లయినా రావాలనే సంకల్పంతో ప్రయత్నాలు కొనసాగించాము.

చివరకు నుంచి న్.ఓ.సి వచ్చిన అనంతరం, సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి ద్వారా శ్రీ కొలను హనుమంత్ రెడ్డి కలిశాము.ఆ సమయంలో హనుమంత్ రెడ్డి మన కాలనీ పరిస్థితిని అర్థం చేసుకుని,“మీ కాలనీకి తప్పకుండా రోడ్లు వేయిస్తాను” అని మాట ఇచ్చారు.ఆయన కేవలం మాట ఇవ్వడమే కాదు... ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు!ఒక్క రోడ్డు కాదు... రెండు రోడ్లు కాదు... మన కాలనీ మొత్తం, ప్రతి రోడ్డును నెల రోజుల లోపే సీసీ రోడ్లుగా మార్చి, ఎన్నో సంవత్సరాలుగా మనం ఎదురుచూస్తున్న కలను నిజం చేశారు. ఇది మన కాలనీ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే అభివృద్ధి. గౌరవనీయులైన కొలను హనుమంత్ రెడ్డి మీరు మా కాలనీ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, వందలాది కుటుంబాలకు ఎంతో అవసరమైన రోడ్ల సౌకర్యాన్ని కల్పించినందుకు మా ప్రతి కుటుంబం తరఫున పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు.సార్, మీ సహాయాన్ని మేము ఎప్పటికీ మరచిపోలేము. మీకు మా కాలనీ ప్రజలమంతా రుణపడి ఉంటాము.సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు ఈరోడ్ల నిర్మాణం కోసం మొదటి నుంచి చివరి వరకు నిరంతరం కృషి చేస్తూ, సంబంధిత అధికారులు, జోనల్ కమిషనర్ మరియు ఇతర విభాగాలతో ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేస్తూ, పనులు పూర్తయ్యే వరకు మన కాలనీకి అండగా నిలిచిన సంజీవ్ రెడ్డి మా ప్రత్యేక ధన్యవాదాలు.మీ ఇద్దరి కృషి, సహకారం వల్లే ఈరోజు మన కాలనీ రోడ్ల రూపురేఖలు మారిపోయాయి. మా కాలనీ అభివృద్ధికి మీరు అందించిన ఈ సహకారానికి మేము ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉంటాము.మున్ముందు కూడా మన కాలనీకి అత్యంత అవసరమైన శాశ్వత డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మీ ఇద్దరి సహకారం, మార్గదర్శకత్వం ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.ఇది కేవలం రోడ్ల నిర్మాణం కాదు... ఎన్నో కుటుంబాల కష్టాలకు లభించిన ఉపశమనం.

హైదరాబాద్‌లో మిసెస్ యూనిటీ వరల్డ్ ఆశా దీపిక అట్టలూరి చారిత్రాత్మక విజయోత్సవ రథయాత్ర

ప్రతిష్ఠాత్మకమైన మిసెస్ యూనిటీ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకున్న తొలి భారతీయ మహిళ ఆశా దీపిక అట్టలూరి, తన చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా రథయాత్ర నిర్వహించారు. హైదరాబాద్ చార్మినార్‌ను ప్రతిబింబించే నాలుగు స్తంభాలు, వాటిపై అద్భుతమైన ఎర్రటి కిరీటంతో రూపొందించిన ప్రత్యేక రథం, ప్రపంచ వేదికపై సాధించిన విజయాన్ని భారతదేశానికి తీసుకువచ్చినందుకు ప్రతీకగా నిలిచింది. అసలైన మిసెస్ యూనిటీ వరల్డ్ కిరీటాన్ని రష్యాలో ఆరు నెలల పాటు అత్యంత కళాత్మకంగా చేతితో తయారు చేస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నాయకురాలిగా, పారిశ్రామికవేత్తగా, సేవా దృక్పథం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందిన ఆశా దీపిక, కేవలం కిరీటం కోసం కాకుండా మానవాళికి సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో అందాల పోటీల్లోకి అడుగుపెట్టారు.

ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో నీటి సంరక్షణపై విద్యార్థుల ద్వారా గ్రామస్థాయిలో అవగాహన

9వ తరగతి విద్యార్థులతో వర్షపు నీటి సంరక్షణపై ప్రాజెక్ట్ వర్క్

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి):- ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో సంభవించే మార్పులను దృష్టిలో ఉంచుకుని, నీటి సంరక్షణపై ముందస్తు సన్నద్ధతలో భాగంగా పాఠశాల విద్యార్థుల ద్వారా గ్రామస్థాయిలో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా 9వ తరగతి విద్యార్థులకు వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం, భూగర్భ జలాల పెంపు ప్రాముఖ్యతపై ప్రాజెక్ట్ వర్క్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ గ్రామాల్లో ఇప్పటికే ఉన్న వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను పరిశీలించి, వాటి పనితీరును తెలుసుకోవడంతో పాటు మరమ్మతులు అవసరమైన నిర్మాణాలను గుర్తించడం, కొత్తగా నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాల్సిన ప్రాంతాలను పరిశీలించడం వంటి అంశాలపై అధ్యయనం చేస్తారు.

విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు, నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా గుర్తించేలా చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్ ద్వారా నేర్చుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులకు, గ్రామ ప్రజలకు వివరించడం ద్వారా గ్రామస్థాయిలో నీటి సంరక్షణపై విస్తృత అవగాహన కల్పించవచ్చని పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావం వల్ల ప్రతి ప్రాంతంలోనూ వర్షపాతం తప్పనిసరిగా తగ్గుతుందని చెప్పలేమని, అయితే వర్షపు నీటిని సాధ్యమైనంత మేర ఒడిసిపట్టడం, ఇంకుడు గుంతలను సక్రమంగా నిర్వహించడం, భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. నీటి భద్రత కోసం జిల్లా యంత్రాంగం చేపడుతున్న ఈ ముందస్తు కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు భాగస్వాములై ప్రతి వర్షపు నీటి బొట్టును సంరక్షించే దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఎల్‌నీనో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి సమస్య తలెత్తకుండా

ప్రతి నీటి బొట్టును ఆదా చేయాలి

ఎస్‌పిఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సొంటి రెడ్డి పున్నారెడ్డి

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 24(వాయిస్ టుడే): ఎల్ నీనో పై ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సొంటిరెడ్డి పున్నారెడ్డి మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావం వచ్చే సంవత్సరం వరకు ఉంటుంది కాబట్టి రాబోయే రోజుల్లో తీవ్ర కరువు సమస్య ఉండటం వలన ప్రతి ఒక్కరూ నీటిని, విద్యుత్ ను ఆదా చేయాలని కోరారు. లేనియెడల ప్రతి ఒక్కరు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని,ప్రతి ఒక్కరు తూచా తప్పకుండా పాటించాలని కోరారు.

ఎంపి చామలను శాలువాతో సన్మానించిన కాంగ్రెస్ నాయకులు.. ప్రమోద్,అక్తర్,శ్రీను

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి):- జాతీయా రహదారి ఎన్ హెచ్ 163 హైదరాబాద్ - వరంగల్ హైవే పై పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో కీలక పాత్ర పోషించిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ని కలసి శాలువాతో సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పీసీసీ ప్రధాన కార్యదర్శులు పొత్నాక్ ప్రమోద్ కుమార్, కసుబ శ్రీనివాస్,నాయకులు మహమ్మద్ అతహర్ లు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి వారితో మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ పరిధిలో గల ఎన్ హెచ్ 163 హైదరాబాద్ - వరంగల్ హైవే పై వాహనాల రద్దీ పెరగడం వలన ప్రజలు ఇబ్బంది తన ద్రుష్టికి రావడంతో రహదారిని 6 లైన్లు గా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రిత్వ శాఖకు, జాతీయ రహదారుల వారికి లేఖలు రాయడం జరిగిందని అట్టి ఫలితంగా దాని కొరకు డిపిఆర్ రిపోర్ట్ తయారు చేస్తున్నామని తెలపడం సంతోషకరమని అన్నారు. అదేవిదంగా గతంలో ప్రతిపాదించిన అనంతారం క్రాస్ రోడ్డు,స్వర్ణగిరి దేవాలయం వద్ద అండర్పాస్ లు మరియు భువనగిరి బైపాస్ వద్ద కల కేంద్రీయ విద్యాలయం వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణం పనులను కూడా చేపట్టే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని, జాతీయ రహదారుల చైర్మన్ తనకు లేఖ ద్వారా తెలపడం జరిగిందని అన్నారు. భువనగిరి పార్లమెంట్ ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పనిచేయడమే తన లక్ష్యం అని తెలిపారు.

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జనరల్ బాడీ సమావేశం

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 24(వాయిస్ టుడే): మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు పాల్గొన్నారు. సమావేశం ముగిసిన అనంతరం అడిషనల్ కలెక్టర్ కలిసి జిల్లాలోని ఫిషరీస్ శాఖకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించడం జరిగింది.ముఖ్యంగా జిల్లాలో ఫిషరీస్‌కు సంబంధించిన సమస్యలు, చేపల పెంపకం మరియు ఈ రంగానికి సంబంధించిన పలు అంశాలను అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ సమస్యలపై సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు:మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు డి ఎఫ్ ఓ వెంకయ్య వైస్ ప్రెసిడెంట్ మోహన్ కృష్ణ మహిళా ప్రతినిధులు సత్యవతి , సంతోషి వెంకటేష్, దేవేందర్ పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఫిషరీస్ రంగ అభివృద్ధే లక్ష్యం... సమస్యల పరిష్కారమే ధ్యేయం!

దసరా సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 24(వాయిస్ టుడే): విజయదశమి దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రివర్యులు, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా వారి నివాసం వద్ద కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ రుద్ర అశోక్ మరియు పోలే శ్రీకాంత్ కలిసి కేటీఆర్ మర్యాదపూర్వకంగా వారి నివాసం లో కలిశారు. విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నింపాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం పనిచేయాలనే సంకల్పంతో ముందుకు సాగాలని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, పార్టీ నాయకత్వం సూచనలతో ప్రజాసేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని నాయకులు తెలిపారు.

నిత్యం చెత్తతో యుద్ధం చేసే మున్సిపల్ కార్మికుల మధ్యన జన్మదినోత్సవం జరుపుకోవడం సంతోషకరం

- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి):- పట్టణములో పారిశుద్ధ పనులు నిర్వహిస్తూ..తెల్ల తెల్లవారకముందే నిరంతరం చెత్త తోటి యుద్ధం చేసే కార్మిక సోదరులకు తన వంతు సహాయకంగా వారిని సన్మానం చేసి,బట్టలు పెట్టడం తన వంతు కర్తవ్యమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ కౌన్సిలర్,పడమటి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. శనివారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జననీ ఫౌండేషన్, భువనగిరి వారు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు సన్మానం,బట్టల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పడమటి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న వారి సేవలకు గాను 20మందిని గుర్తించి వారిని సన్మానించి, బట్టలు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరము కార్మికుల మధ్యన పుట్టినరోజు జరుపుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. తాను 2005 నుంచి ఇప్పటివరకు నిర్విరామంగా ప్రతి పుట్టినరోజు 24 అక్టోబర్ రోజున కార్మికులు తో పాలుపంచుకుంటూ వారి మధ్యనే పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటూ కార్మికుల యొక్క ఆరోగ్యం, యోగక్షేమాలను తెలుసుకొని వాళ్ళకు అండగా నిలబడాలని, ప్రజల ఆరోగ్యం కాపాడడం కోసం, రోజు నిత్యం శ్రమిస్తున్నటువంటి కార్మికులకు మనం అండగా ఉండాలని, వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం, వైద్య సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టి బాలయ్య రోటరీ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, నిమ్మయ్య, జిట్ట భాస్కర్ రెడ్డి మా తల్లిదండ్రులు సావిత్రమ్మ పాండురంగా రెడ్డి వేణు మాజీ బిజెపి అధ్యక్షుడు ఉమా శంకర్ ,అశోక్ యాదవ్ ,బాల్ శంకర్ మధుసూదన్ రెడ్డి, అశోక్ కుమార్ గౌడ్, అన్నగారి ఆత్మీయ మిత్రుడు మండవ శ్రీశైలం మొదలగు వారు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఫుట్‌బాల్ ఫొటో జ్ఞాపిక అందజేత

మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి అందించిన ఆగం పాండు ముదిరాజ్

హైదరాబాద్,అక్టోబర్24 : (వాయిస్ టుడే) పండుగ సాయన్న జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి వాకిటి శ్రీహరి తోపాటు పండుగ సాయన్న ఉత్సవ కమిటీ సభ్యులు బాచుపల్లి మాజీ సర్పంచ్, ఆగం పాండు ముదిరాజ్ ఫుట్‌బాల్ ఆడుతున్న సీఎం ఫొటోతో రూపొందించిన జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొని ముఖ్యమంత్రికి జ్ఞాపికను అందించారు. పండుగ సాయన్న జయంతి వేడుకల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్
ప్రజల గొంతుక - నిజం కోసం.. ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
ఆదివారం 25 అక్టోబరు 2026

దుండిగల్ రైతుల భూ సమస్యపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన బొంగునూరి కిషోర్ రెడ్డి కావలి గణేష్

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 24(వాయిస్ టుడే): మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ గ్రామం సర్వే నంబర్లు 453, 454లోని అసైన్డ్ భూముల ల్యాండ్ పూలింగ్ అంశంపై స్పష్టత కోరుతూ తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార మరియు పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారిని తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి , దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ మరియు దుండిగల్ రైతులు మర్యాదపూర్వకంగా కలిశారు.గత మూడు నెలలుగా రెవెన్యూ అధికారులు రైతులతో గ్రామసభలు నిర్వహించినప్పటికీ, ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన తదుపరి సమాచారం అందకపోవడంతో రైతులు తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.సర్వే నంబర్లు 453, 454లోని అసైన్డ్ భూముల ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన సమాచారం అందించి, రైతుల సందేహాలను నివృత్తి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు బొమ్మల అశోక్ ముదిరాజ్, పండుగ శ్రీశైలం ముదిరాజ్ ,దొంతి మహేష్ ముదిరాజ్, బిక్షపతి, కావలి శంకరయ్య, చెలకల అశోక్, చంద్రయ్య, జక్కుల కృష్ణ యాదవ్, సిరగల స్వామి. తదితరులు పాల్గొన్నారు. దుండిగల్ రైతుల భూ సమస్య పరిష్కారం దిశగా స్పష్టమైన సమాచారం అందించాలని రైతులు కోరుతున్నారు.

దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు

కూకట్‌పల్లి: అక్టోబర్ 24 (వాయిస్ టుడే): దసరా పండుగ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణును సీనియర్ కాంగ్రెస్ నాయకులు బి. సంజీవ రావు, కొమ్ము బాబు రావు మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరికీ కొత్త ఆశలు, విజయాలను అందించాలని కోరుకున్నారు. ఈ కలయికలో నాయకులు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుని పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు. పండుగలు సామాజిక ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు నాయకులు, కార్యకర్తల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'సర్వే లోపాలను సరిదిద్ది ప్రచురించాలి'

బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం

హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహించిన సమగ్ర కుల సర్వే (SEEEPC)లోని లోపాలను సరిదిద్దకుండా దేశానికి 'రోల్ మోడల్' అని ప్రకటించుకోవడం కేవలం ప్రచార ఆర్భాటమేనని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు విమర్శించారు. జనాభా వివరాల్లో తప్పులను సరిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై స్పందిస్తూ.. ప్రభుత్వం వెంటనే దీనిపై స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అధికారిక సర్వేలో మిగిలిపోయిన కుటుంబాలను నమోదు చేయడంతో పాటు కులాల పేర్లు, వర్గీకరణలలో ఉన్న అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలన్నారు. చట్టబద్ధమైన రాష్ట్ర బీసీ కమిషన్‌ను పక్కన పెట్టడం వల్లే ఈ వివాదాలు తలెత్తాయని తెలిపారు. సర్వే మొత్తాన్ని తిరిగి చేయాల్సిన అవసరం లేదని, విడిపోయిన కుటుంబాలను చేర్చి, తప్పులను సరిదిద్ది ఆ వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

చిన్నారి ప్రఖ్యాతకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆశీస్సులు

మొయినాబాద్: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర చిన్నారి కేయూర ప్రఖ్యాతకు ఆశీస్సులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మనుమరాలు ప్రఖ్యాత పుట్టినరోజు వేడుకలు శనివారం రాత్రి మొయినాబాద్ మండలం కనకమామిడిలోని ఆర్త్ రిసార్ట్స్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర చిన్నారికి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. గంటా శ్రీనివాసరావు, ఆయన కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఐపీ ఛానళ్లకు అక్రెడిటేషన్లు ఇవ్వలేం: మంత్రి పొంగులేటి

జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయింపు

హైదరాబాద్, అక్టోబర్ 24: కేబుల్ టీవీల స్థానంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఇంటర్నెట్ ప్రోటోకాల్ టెలివిజన్ (ఐపీ) ఛానళ్లకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వడం కుదరదని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలో ప్రతినిధుల బృందం శనివారం సచివాలయంలో మంత్రిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అక్రెడిటేషన్ల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 22 వేల కార్డులు ఇస్తే, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 26 వేల కార్డులు జారీ చేసిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తామని తెలిపారు. అయితే గతంలో లేని ఐపీ ఛానళ్లకు కొత్తగా అక్రెడిటేషన్లు ఇవ్వడం సాధ్యపడదని తేల్చి చెప్పారు.

శాశ్వత పరిష్కార దిశగా చర్యలు

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించి సొంతంటి కలను సాకారం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. గతంలో ఎదురైన న్యాయపరమైన చిక్కులు పునరావృతం కాకుండా చట్టబద్ధంగా శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని, మళ్లీ తమ ప్రభుత్వంలోనే ఇస్తామని స్పష్టం చేశారు.

వివిధ డిమాండ్లతో వినతిపత్రం

అంతకుముందు టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ.. సాంకేతిక మార్పులకు అనుగుణంగా కేబుల్ నెట్‌వర్క్ నుంచి ఐపీ ఆధారంగా నడుస్తున్న న్యూస్ ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్లు ఇవ్వాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని, 60 ఏళ్లు దాటిన సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ పథకం వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కుంచం శ్రీనివాస్, రవికుమార్, కేబుల్ ఛానల్స్ అసోసియేషన్ ప్రతినిధులు సుభాష్, భరత్, శ్రీరాములు, షఫియుద్దీన్, ప్రతాప్, రాచర్ల గోపి, సుధాకర్, విజ్ఞేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం: డా. సత్యం శ్రీరంగం

అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి..
ఫామ్-18 ద్వారా ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్‌లో ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన టీపీసీసీ అధికార ప్రతినిధి

కూకట్‌పల్లి:అక్టోబర్ 24(వాయిస్ టుడే): హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకునేందుకు మాజీ పట్టణ అధ్యక్షుడు సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఆన్‌లైన్‌లో ఫామ్-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రతి ఓటును కీలకంగా భావించి, పట్టభద్రులను వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడంతో పాటు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించి, వారి సమస్యలను తెలుసుకుంటూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు కూడగట్టాలని కార్యకర్తలకు సూచించారు. యువత కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని డా. సత్యం శ్రీరంగం ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో విపక్షాలకు ఓటమి తప్పదని, ప్రగతి నిరోధకులకు పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ గౌడ్, సీనియర్ నాయకులు సంజీవ్ రావు, దేశాల్, విట్టల్ రెడ్డి, సాధు ప్రతాప్ రెడ్డి, కొండల్ రెడ్డి, మేకల మైఖేల్, ఏఎంసీ డైరెక్టర్ ఫణి కుమార్, డివిజన్ మాజీ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్ కుమార్, శ్రీధర్ చారి, బాబు రావు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో లోధి సమాజ్ పాత్ర కీలకమైనది: కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ

హైదరాబాద్‌లో వైభవంగా ముగిసిన అఖిల భారతీయ లోధి మహాసభ

హైదరాబాద్, అక్టోబర్ 24: దేశ నిర్మాణంలో లోధి సమాజ్ అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ (బన్వారీ లాల్ వర్మ) అన్నారు. శనివారం హైదరాబాద్ లోని ధూల్‌పేట్‌లోని 'రాణి అవంతీబాయి భవన్'లో అఖిల భారతీయ లోధి-లోధా-లోధి మహాసభ తెలంగాణ రాష్ట్ర విభాగం నిర్వహించింది. రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మతో పాటు జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే విపిన్ కుమార్ వర్మ (డేవిడ్), మధ్యప్రదేశ్ మంత్రి ప్రహ్లాద్ పటేల్, ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి జాలిమ్ సింగ్ పటేల్, మాజీ మంత్రి డాక్టర్ రవీందర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ మాట్లాడుతూ... లోధి సమాజ సభ్యులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్య, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో సమాజ ప్రజలు మరింత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం లోధి వర్గాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, సమాజమంతా సంఘటితంగా పోరాడితేనే సమాజానికి దక్కాల్సిన అభివృద్ధి నిధులు సాధించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ సింగ్ మాట్లాడుతూ... దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి లోధి సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, పెద్దలు ఈ మహాసభకు విచ్చేయడం ఎంతో గర్వకారణమన్నారు. తమ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే స్వయం సమీక్ష చేసుకుంటూ, లోపాలను సవరించుకొని ముందుకు సాగాలని సూచించారు. దేశవ్యాప్తంగా వివిధ హోదాల్లో లోధి సమాజ సభ్యులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, స్వల్ప వ్యవధిలోనే ఈ మహాసభను అత్యంత దిగ్విజయంగా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు.

ఈ మహాసభలో జనరల్ సెక్రటరీ శైలేందర్ సింగ్, ఠాకూర్ జితేందర్ సింగ్, యూత్ ప్రెసిడెంట్ దీపక్ సింగ్, మహిళా అధ్యక్షురాలు లీనా సింగ్, జనరల్ సెక్రటరీ నిషా సింగ్, కోశాధికారి అంజురాణి, ఉపాధ్యక్షురాలు పూజా సింగ్, దినేష్ సింగ్, పప్పు మాత్రే, ప్రశాంత్ సింగ్, రోహన్ సింగ్, ఉపేందర్ సింగ్లతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో లోధి సామాజిక వర్గానికి చెందిన మహిళలు, యువకులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి: కేటీఆర్

రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి యువత కృషి చేయాలి

యువత తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు

అంబర్‌పేట, అక్టోబర్ 24: యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని, యువత సంకల్పిస్తే సాధించలేనిది ఏదీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పార్టీ విజయానికి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ యువ నాయకుడు బొల్లపల్లి లక్ష్మణ్ రాజును కేటీఆర్‌కు పరిచయం చేశారు. లక్ష్మణ్ రాజు పార్టీలో చురుకుగా పనిచేస్తున్నారని, కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారని, పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ వాటిని విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని కాలేరు వెంకటేష్ వివరించారు.

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో యువత పార్టీకి మరింత కీలకంగా మారాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజల్లో ఎండగట్టడంతో పాటు, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాల్లో యువత ముందుండి పనిచేయాలని, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని అన్నారు.ఈ సందర్భంగా బొల్లపల్లి లక్ష్మణ్ రాజు మాట్లాడుతూ, కేటీఆర్ ప్రసంగం యువతకు దిశానిర్దేశం చేసిందని పేర్కొన్నారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని, పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు శ్రమిస్తామని తెలిపారు.

ఎల్నినో విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది

నీటిని,విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలి

పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలి

సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్, అక్టోబర్ 24(వాయిస్ టుడే): ఎల్నినో విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్నిరకాలుగా సిద్ధంగా ఉందని ప్రజలు నీరు,కరెంటు విషయంలో పొదుపు పాటించాలని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.ముకరంపురలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎల్నినో కారణంగా అనేక దేశాలు ఇబ్బందులు పడుతున్నాయని ఎన్నో ఏళ్ల తరువాత ఈ విపత్తు ఏర్పడిందని,ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం సూచించిన విధంగా సహకరించాలని కోరారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి సమస్య అదేవిధంగా విద్యుత్ కొరత సమస్య ఏర్పడే అవకాశం ఉన్నందున ఈ రెండిటి విషయంలో ప్రజలు పొదుపు పాటించాలని కోరారు.ఇది ప్రకృతి వైపరీత్యం వల్ల ఏర్పడిన విపత్తు అయితే ప్రతిపక్షాలు కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ప్రభుత్వంపై తోసేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నాయని, ఇటువంటి సందర్భాలలో ప్రతి పక్షాలు భాద్యతగా వ్యవహరించాలని,గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరోనా వైరస్ వ్యాప్తి విషయంలో ఆనాడు కాంగ్రెస్ పార్టీ భాద్యతగా వ్యవహరించలేదా అని ప్రశ్నించారు.ఎల్నినో విపత్తును ఎదుర్కొనేందుకు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.నామినేటెడ్ పదవుల విషయంలో మరియు సుడా చైర్మన్ పదవి గురించి అడిగిన ప్రశ్నకు నరేందర్ రెడ్డి సమాధానం చెప్తూ 30 సంవత్సరాలకు పైగా నిబద్ధతతో కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నానని మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో టికెట్ ఆశించి భంగపడ్డా పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు ఎవరికి అవకాశం ఇచ్చినా వారితో కలిసి పనిచేయడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సుడా చైర్మన్ గా నాకు అవకాశం కల్పించినందుకు ఎప్పటికీ కృతజ్ఞతభావంతో ఉంటానని సుడా చైర్మన్ గా కూడా ఎంతో నిబద్ధతతో పని చేశానని సుడాకు రెవిన్యూ జనరేట్ చేసి ఆ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందని ఇంకా మిగిలిపోయిన పనులు పూర్తి చేయడానికే రీన్యూవల్ కోసం ప్రయత్నిస్తున్నానని నరేందర్ రెడ్డి పేరొన్నారు.కావాలని కొంతమంది లేనిదాన్ని ఉన్నట్టు చూపించి నాపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని అటువంటి ప్రయత్నాలు మానుకోవాలని ఎవరేమిటో ప్రజలకు తెలుసని నరేందర్ రెడ్డి అన్నారు.ఈ సమావేశంలో మైనారిటీ సెల్ జిల్లా చైర్మన్ ఎండి తాజ్,గుండాటి శ్రీనివాస్ రెడ్డి, లాయక్,షబానా మహమ్మద్, అస్థాపురం రమేష్,జీడి రమేష్,మామిడి సత్యనారాయణ రెడ్డి,సాయిరాం,బషీర్, భారీ,జిలుకర రమేష్,హనీఫ్ పాల్గొన్నారు.

12వ రోజుకు చేరిన NHM ఉద్యోగుల నిరవధిక సమ్మె

ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలవాలి

సిరిసిల్ల, అక్టోబర్ 24 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) ఉద్యోగుల నిరవధిక సమ్మె నేటికి 12వ రోజుకు చేరింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో 17 వేల మంది చీఎవీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె కొనసాగిస్తున్నారు.12 రోజులుగా ప్రభుత్వం నుండి స్పందన లేదు.తమ సమస్యల పరిష్కారం కోసం రోజుకో వినూత్న రీతిలో – ఒంటి కాలిపై నిలబడటం, ప్లకార్డుల ప్రదర్శన, కళ్లకు గంతలు, భిక్షాటన వంటి శాంతియుత నిరసనలు చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నుండి ఇప్పటివరకు చర్చలకు ఎటువంటి పిలుపు రాలేదని చీఎవీ జీూజ ఆవేదన వ్యక్తం చేసింది. ఇది చాలా బాధాకరమని మహిళా ఉద్యోగులు తెలిపారు.మా ప్రధాన డిమాండ్లు: ఉద్యోగాలను క్రమ బద్ధీకరించి (రెగ్యులరైజ్) ఉద్యోగ భద్రత కల్పించాలి,మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి. ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి, PRC అమలు చేయాలి, 5% వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలి. అన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి, వెంటనే చర్చలకు పిలిచి మా సమస్యలను పరిష్క రించాలని తెలిపారు. చర్చలు జరిగే వరకు మా నిరవధిక సమ్మె శాంతి యుతంగా కొన సాగుతుందని చీఎవీ జీూజ తెలంగాణ స్పష్టం చేసింది.సమ్మె కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ఉండాలంటే ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

ఉద్యోగుల నిరవధిక సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మద్దతు

కరీంనగర్,అక్టోబర్ 24(వాయిస్ టుడే):జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 12 రోజులుగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు సీపీఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మద్దతు ప్రకటించారు.ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి,వారి న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పేదలు,గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో వారి సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు.ప్రజారోగ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిందని,అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడం శోచనీయమని విమర్శించారు.ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు 12 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడి రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వం,ఆ సేవలను అందించే ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరిపి సమ్మెను పరిష్కరించాలని కోరారు.ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని,సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఉద్యోగులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు మహిళా ఉద్యోగులకు చట్టబద్ధమైన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు.ఉద్యోగులందరికీ ఈఎస్ఐ,పీఎఫ్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని,ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు లభించే న్యాయమైన సౌకర్యాలను వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉత్తమ వైద్య సేవలతో ఉన్నత స్థానాలకు ఎదగాలి

సామాజిక సేవలో భాగంగా కొందరికైనా ఉచిత వైద్యం చేయాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఘనంగా వైట్ కోట్ సెర్మనీ

హాజరైన జిల్లా కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితె

రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 24 (వాయిస్ టుడే): వైద్య కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు డాక్టర్లుగా ఉత్తమ వైద్య సేవలు అందించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో "వైట్ కోట్ సెర్మనీ" నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం గా పలువురు వైద్య విద్యార్థులకు వైట్ కోట్ లు అందజేసి అభినందించారు. అనంతరం నిర్వాహకులు జిల్లా కలెక్టర్, ఎస్పీని శాలువాతో సన్మానించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, సమాజంలో వైద్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని తెలిపారు. వైద్య విద్య అభ్యసించేందుకు చాలా కష్ట పడాల్సి ఉంటుందని, నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఈ అవకాశం వస్తుందని వివరించారు. ప్రతి విద్యార్థి విజయం వెనుక వారి తల్లిదండ్రుల శ్రమ, ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు. వైద్యుల సేవలు చాలా కీలకమని స్పష్టం చేశారు. గర్భిణులు, పిల్లలు, వివిధ రోగాలతో బాధ పడే వారికి వైద్యులు ఎంతో ఓపికతో సేవలు అందిస్తారని కొనియాడారు. వైద్యులు తాము ఎంచుకున్న విభాగంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో భాగంగా వైద్యులు కొందరికైనా ఉచిత వైద్య సేవలు అందించాలని సూచించారు. దీంతో ఆత్మ సంతృప్తి ఉంటుందని తెలిపారు. వైద్యం, సేవల్లో మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాక్షించారు. వైద్యులు తమ ఆరోగ్యం, ఆహారం శ్రద్ధ పెట్టాలని సూచించారు. సిరిసిల్ల వైద్య కళాశాల, బాలికల, బాలుర హాస్టల్ నిర్మాణ పనులను తాను పలుమార్లు సందర్శించానని గుర్తు చేశారు. ప్రస్తుతం బాలికల హాస్టల్ వినియోగంలోకి వచ్చిందని తెలిపారు. మెడికల్ కాలేజీ, బాలుర హాస్టల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి.. త్వరలోనే వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమం లో రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ నిర్విష, తహసీల్దార్ మహేష్ కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ విజేత గుజరాత్, వాలీబాల్ విజేత గోవా

హైదరాబాద్, అక్టోబర్ 24: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) బర్కత్‌పుర రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఈపీఎఫ్ఓ వెస్ట్ జోన్ బాస్కెట్‌బాల్ అండ్ వాలీబాల్ టోర్నమెంట్' శనివారం ముగిసింది. నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రాంగణంలో అక్టోబర్ 23, 24 తేదీలలో ఈ పోటీలు జరిగాయి. ఈ టోర్నీలో తెలంగాణ, గోవా, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ఐదు జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. పోటీలను తెలంగాణ అడిషనల్ సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విపిన్ కుమార్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్లు శ్రీకాంత్ జి. పుల్‌పగార్, తేజ్ ప్రతాప్ సింగ్ యాదవ్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. రెండు రోజుల పాటు సాగిన ఈ క్రీడా పోటీలు ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని, క్రమశిక్షణను, జట్టు భావాన్ని పెంపొందించాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో బాస్కెట్‌బాల్ విభాగంలో గుజరాత్ జట్టు విజేతగా నిలవగా, వాలీబాల్ విభాగంలో గోవా జట్టు ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ముగింపు ఉత్సవాలకు రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పి.ఆర్. శ్రీజిత్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

కనకదుర్గమ్మకు ఎంపీ వద్దిరాజు ప్రత్యేక పూజలు

తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురవాలి.. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి: ఎంపీ

విజయవాడ: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శనివారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తన గోత్ర నామాలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎంపీ రవిచంద్రకు వేద పండితులు పూలమాలతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన వెంట అనుచరుడు మహంకాళి రాజశేఖర్ ఉన్నారు. తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురిసి కరువు కాటకాలు తొలగిపోవాలని, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కనకదుర్గమ్మను ప్రార్థించినట్లు ఎంపీ రవిచంద్ర తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించి, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

22 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన శ్రీ విద్య పూర్వ విద్యార్థులు

తీపి జ్ఞాపకాలతో ఆత్మీయ సమ్మేళనం.. గురువులకు కృతజ్ఞతలు

ఖమ్మం, 24 (వాయిస్ టుడే): ఖమ్మం పట్టణంలోని శ్రీ విద్య ఇంటర్ కాలేజీ 2002--2004 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. స్థానిక మారమ్మ తల్లి ఆలయం సమీపంలోని అనుమూల దశవంత్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా 22 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి తమ కళాశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థి దశలో కలిసి చదువుకున్న రోజులు, స్నేహితులతో గడిపిన క్షణాలు, పండుగ సెలవుల్లో ఆటపాటలతో గడిపిన సమయం, కళాశాలలో జరిగిన వివిధ కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు. సెల్‌ఫోన్లు, ఆధునిక డిజిటల్ పరికరాలు అందుబాటులో లేని రోజుల్లో చదువుకే ప్రాధాన్యతనిస్తూ,స్నేహబంధాలకు విలువనిస్తూ గడిపిన కాలాన్ని గుర్తుచేసుకుని ఆనందం వ్యక్తం చేశారు.

కొత్త సినిమాలు విడుదలైనప్పుడు స్నేహితులంతా కలిసి సినిమాలకు వెళ్లిన సందర్భాలు, కళాశాలలో చేసిన సరదాలు, అప్పటి విద్యావిధానం, ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులకు ఉన్న గౌరవం వంటి అంశాలను పరస్పరం పంచుకున్నారు. అప్పట్లో నిర్వహించిన విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు తమలోని ప్రతిభను వెలికితీసి, మేధాశక్తిని పెంపొందించేందుకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. తమ జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకున్నారు. గురువులు అందించిన విద్యాబోధన, క్రమశిక్షణ, విలువలు తమ ప్రస్తుత జీవితానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. 2002--2004 బ్యాచ్‌కు చెందిన పలువురు ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేట్ రంగాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కలుసుకోవడం తమకు ఎంతో ఆనందాన్ని, కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు. పాత స్నేహాలను పునరుద్ధరించుకుంటూ, భవిష్యత్తులోనూ ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

వాయిస్
హైదరాబాద్
ఆదివారం 25 అక్టోబరు 2026

ఏసిపి బత్తుల శివ కుమార్ సన్మానించిన మున్నూరు కాపు నాయకులు

కరీంనగర్,అక్టోబర్ 24(వాయిస్ టుడే):రంగారెడ్డి జిల్లాలో పోలీస్ ఏసిపిగా నియామకమైన మున్నూరు కాపు ముద్దుబిడ్డ బత్తుల శివ కుమార్ ను రాష్ట్ర మున్నూరుకాపు సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ మున్నూరు కాపులు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ తోటి మున్నూరు కాపు యువతకు ఆదర్శంగా నిలవాలని,అలాగే యువతకు మార్గదర్శకం చూపాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో మంకమ్మ తోట మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ముప్పిడి సునీల్ కుమార్ పటేల్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు కూరగాయల తిరుపతి, దామరకొండ సంతోష్ పటేల్,వాసాల హరీష్,ఆవుల శ్రీనివాస్,ఒంటెల శరత్, నేతకుంట అజయ్ పాల్గొన్నారు

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల్లో విశ్వాసం పెంచాలి : పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

హుజూరాబాద్ అక్టోబర్ 24 (వాయిస్ టుడే): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందిస్తూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పిలుపునిచ్చారు. హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. స్టేషన్‌కు విచ్చేసిన సీపీకి హుజూరాబాద్ ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ పూలమొక్కను అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాల నుంచి గౌరవ వందనాన్ని కమిషనర్ స్వీకరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లోని పలు విభాగాలు, రిజిస్టర్లు, దస్త్రాలను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది విధుల కేటాయింపు, క్షేత్రస్థాయి పనితీరు పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో మరింత పారదర్శకత, వేగవంతమైన పనితీరు కనబరచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, స్టేషన్ పరిధిలోని నిఘా కెమెరాలు నిరంతరం పనిచేసేలా ప్రత్యేక నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. పెట్రోలింగ్ వాహనాలు, ఆధునిక పరికరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహిస్తూ అత్యవసర వేళల్లో ప్రజలకు వెంటనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కేస్ ప్రాపర్టీ భద్రత, రికార్డుల క్రమబద్ధీకరణ, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపయోగంలో లేని పాత సామాగ్రిని కమిషనరేట్‌కు తరలించి, స్టేషన్ ప్రాంగణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్సైలు రవి, కృష్ణా రావు, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థ సేవలు పేద ప్రజలు వినియోగించుకోవాలి

– న్యాయమూర్తి కిరణ్ కుమార్

హుజూరాబాద్ అక్టోబర్ 24 (వాయిస్ టుడే): వివిధ కారణాలవల్ల జైలులో శిక్షలు అనుభవిస్తున్న నిరుపేద ఖైదీలకు న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సేవా సహకారాన్ని అందిస్తుందని ఇట్టి సహకారాన్ని పేద ప్రజల వినియోగించుకోవాలని హుజరాబాద్ న్యాయమూర్తి కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం రోజున హుజురాబాద్ సబ్ జైల్లో ఖైదీలకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం పొందడం రాజ్యాంగ బద్ధమైన హక్కు అని, న్యాయ సేవాధికార సంస్థ చట్టం కింద అందుబాటులో ఉన్న ఉచిత న్యాయవాది సేవలు, బెయిల్ పొందే విధానాలు ద్వారా న్యాయం పొందవచ్చు అన్నారు. ఈ సందర్భంగా ఖైదీలు అడిగిన పలు న్యాయపరమైన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ సదస్సులో హుజురాబాద్ సబ్ జైలు పర్యవేక్షణ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ జైలర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య విద్యకు పెద్దపీట వేయాలి

అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి

త్వరలో ఆస్ట్రేలియా కరికులంతో ఇంటర్నేషనల్ స్కూల్

త్వరలో నర్సరీ నుంచి పన్నెండవ తరగతి వరకు ప్రత్యేక తరగతులు

కరీంనగర్,అక్టోబర్ 24(వాయిస్ టుడే): భారతీయ విద్యా వ్యవస్థ అకాడమిక్స్ పరంగా ప్రపంచంలో అగ్రగామిగా ఉన్నప్పటికీ,నైపుణ్య (స్కిల్) ఆధారిత విద్యలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. విజయదశమి సందర్భంగా ఆయన ఆస్ట్రేలియా పర్యటన విశేషాలను మీడియాకు వెల్లడిస్తు అక్టోబర్ 17 నుంచి 22 వరకు పశ్చిమ ఆస్ట్రేలియాలో పర్యటించి,పలు యూనివర్సిటీలు, పాఠశాలలను సందర్శించినట్లు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 12 మంది ఎడ్యుకేషన్ లీడర్లతో కలిసి అక్కడి విద్యా విధానం,కరిక్యులం,ఉపాధి అవకాశాలను పరిశీలించినట్లు చెప్పారు. మన దేశంలో విద్య కేవలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్,డాక్టర్లను తయారు చేసే దిశగానే సాగుతోందని నరేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. దీనివల్ల అందరూ ఆ స్థాయికి చేరలేక నిరుద్యోగ సమస్య పెరుగుతోందని,టెక్నికల్, ఒకేషనల్,స్కిల్ బేస్డ్ కోర్సుల్లో వెనుకబడిపోతున్నామని తెలిపారు. చిన్నపాటి సాంకేతిక పనులకు సైతం ఇతరులపై ఆధారపడే పరిస్థితి నెలకొందన్నారు. ఆస్ట్రేలియాలో మాత్రం బైపీసీ,ఎంపీసీలతో పాటు సీఈసీ,ఎంఈసీ, వెటర్నరీ,ఆర్ట్స్,మ్యూజిక్,స్పోర్ట్స్ తదితర అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని,అక్కడ విద్యార్థుల్లో ఎలాంటి ఒత్తిడి కనిపించదని పేర్కొన్నారు. అక్కడ నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విద్యా విధానం అమల్లో ఉందని,మధ్యలో బోర్డు పరీక్షల ఒత్తిడి లేకుండా ఇంటర్నల్ ఎగ్జామ్స్‌కు 50 శాతం మార్కులు కేటాయిస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూనియర్ కళాశాలను పాఠశాల స్థాయిలో విలీనం చేసే అంశంపై స్పష్టతనిచ్చిన నేపథ్యంలో,ఈ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అలాగే 8వ తరగతి నుంచే విద్యార్థులకు నచ్చిన సబ్జెక్టులు (బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్,అగ్రికల్చర్ సైన్స్,స్పోర్ట్స్) ఎంచుకునే స్వేచ్ఛ ఉందని వివరించారు. మైనర్ పిల్లల ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని అక్కడ చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారని చెప్పారు. తల్లిదండ్రుల ఆసక్తికి అనుగుణంగా అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో త్వరలో వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు నరేందర్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి ప్రభుత్వ ఆమోద ప్రక్రియ తుది దశకు చేరిందని,రాబోయే విద్యా సంవత్సరంలో నర్సరీ నుంచి రెండో తరగతి వరకు ఈ కరిక్యులంతో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి తేవద్దని,ఐఐటీ,మెడిసిన్‌తో పాటు క్లాట్,సీఏ,అగ్రికల్చర్,స్పోర్ట్స్ తదితర రంగాల వైపు కూడా పిల్లలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల్లో ఇన్ఫ్రాస్ట్రక్చర్,డిజిటల్ బోర్డులు,లేబరేటరీలను మరింత ఆధునీకరిస్తామని హామీనిచ్చారు.

కరీంనగర్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా జలాలుద్దీన్ అక్బర్ నియామకం

కరీంనగర్,అక్టోబర్ 24(వాయిస్ టుడే): కరీంనగర్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా నియమించబడిన జలాలుద్దీన్ అక్బర్ ను కాంగ్రెస్ ముస్లిం మైనారిటీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసి,ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ముస్లిం నాయకులు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా అదనపు డీఆర్ఓలకు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా బాధ్యతలు అప్పగిస్తూ వచ్చారని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తిని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా నియమించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,దుద్దిళ్ల శ్రీధర్ బాబు,అడ్డూరి లక్ష్మణ్ కుమార్,డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ,మేడిపల్లి సత్యంకు కరీంనగర్ ముస్లిం మైనారిటీల పక్షాన, కాంగ్రెస్ ముస్లిం మైనారిటీ విభాగం పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు నేహాలు అహ్మద్,డీసీసీ స్పోక్స్‌పర్సన్ జమీల్,యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షాబ్బజ్,అర్బన్ డీసీసీ స్పోక్స్‌పర్సన్ మహమ్మద్ అమీర్, చాంద్, ఆరిఫ్,అజీమ్,అబ్దుల్ భారీ,అజ్మత్,సలీం, జాఫర్,జమీల్,ముఫ్తీ,సద్దాం,సర్వర్ ఖాన్, సాదిక్,వాజిద్ పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సీపీ గౌష్ ఆలం

కరీంనగర్, అక్టోబర్ 24(వాయిస్ టుడే): నగరంలోని వివేకానంద డిగ్రీ కళాశాల,హుజూరాబాద్లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలల్లో టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో జరుగుతున్న అసిస్టెంట్ సైంటిస్ట్,అనలిస్ట్ గ్రేడ్-I ఆన్లైన్ పరీక్ష కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన భద్రత కల్పించామని,అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 144 అమలు చేస్తూ, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించినట్లు వెల్లడించారు. సీసీ కెమెరాల నిఘా,బయోమెట్రిక్ విధానం, అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ తనిఖీల్లో పోలీస్ అధికారులు,కేంద్రాల సమన్వయకర్తలు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో పల్స్ పోలియో నిర్మూలన అవగాహన ర్యాలీ

– "ఎండ్ పోలియో నౌ" హోర్డింగ్ ఆవిష్కరణ

వరంగల్ (వాయిస్ టుడే) అక్టోబర్ 24 : రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో "ప్రపంచ పోలియో దినోత్సవం" సందర్భంగా "పోలియో నిర్మూలన" అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా "ఎండ్ పోలియో నౌ" అవగాహన హోర్డింగును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా అసిస్టెంట్ గవర్నర్ శారు ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రవిప్రకాష్, జిడబ్ల్యూఎంసి ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు అనంతుల కుమారస్వామి, కార్యదర్శి చందా రఘువీర్, కోశాధికారి చెరుకు రాజేందర్ రెడ్డి, ప్రోగ్రాం ఛైర్మన్ గంగిశెట్టి పూర్ణచందర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలియో నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించడంలో టీకాల ప్రాముఖ్యతను తెలియచేయడానికి క్లబ్ ఆధ్వర్యంలో "పోలియో నిర్మూలన" అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు అనంతుల కుమారస్వామి తెలిపారు. ఉదయం 7 గంటలకు వరంగల్‌లోని ఎస్.బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ చౌరస్తా మీదుగా హెడ్ పోస్ట్ ఆఫీస్ వరకు వెళ్లి తిరిగి ఎస్.బిఐ మెయిన్ బ్రాంచ్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో రోటేరియన్లు ఉత్సాహంగా పాల్గొని పోలియో రహిత ప్రపంచం కోసం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలన కోసం రోటరీ ఇంటర్నేషనల్ చేస్తున్న నిరంతర కృషిని ఈ సందర్భంగా చాటిచెప్పారు. ర్యాలీ అనంతరం ఎస్.బి.ఐ మెయిన్ బ్రాంచ్ పక్కనే ఉన్న ఆకారపు పెట్రోల్ పంప్ వద్ద "ఎండ్ పోలియో నౌ" అవగాహన హోర్డింగ్‌ను ఆవిష్కరించారు.

ముంచుకొస్తున్న కరువు ముప్పుపై ముందస్తు ప్రణాళిక అవసరం

వరికి బదులుగా ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలి

ఇల్లంతకుంట మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

ఇల్లంతకుంట,అక్టోబర్ 24(వాయిస్ టుడే): కరోనా అనంతరం ఎల్నినో ప్రభావంతో ముంచుకొస్తున్న కరువు ముప్పును ఎదుర్కొనేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ఎదురయ్యే కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇల్లంతకుంట మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన అభివృద్ధి సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యి మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయని,దీంతో కరువు పరిస్థితులు తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామసభలు నిర్వహించి,ఎల్నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులు,వ్యవసాయ రంగంపై పడే ప్రభావం గురించి రైతులకు వివరించాలని ఆదేశించారు. పంటల ఎంపిక,సాగు విధానాల విషయంలో రైతులకు తగిన అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న రోజుల్లో పశువులు,పక్షులు సైతం నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు తలెత్తవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవడం అత్యంత అవసరమన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ సమస్యలు తీవ్రమయ్యే అవకాశాలున్నాయని ఎమ్మెల్యే హెచ్చరించారు. విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గినట్లు పేర్కొంటూ, పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సూచించారు. గ్రామాల్లో విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సర్పంచులు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో చాటింపు ద్వారా ప్రజలకు సమాచారం అందించి,విద్యుత్ వృథాను అరికట్టేలా చూడాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వాటి వల్ల కలిగే నష్టాన్ని తగ్గించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడం ముఖ్యమని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా ప్రభుత్వాలపై నెపం మోపడం సరికాదన్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని,సమష్టి కృషితోనే సమస్యలను సమర్థంగా ఎదుర్కోగలమని తెలిపారు. అంతకుముందు పలువురు సర్పంచులు తమ తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వై.శశికళ, మండల తహసీల్దార్ సురేష్, ఇల్లంతకుంట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ ఊట్కూరి వెంకట రమణారెడ్డి,సర్పంచుల ఫోరం చైర్మన్ మామిడి రాజు,వివిధ గ్రామాల సర్పంచులు,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడే భగలా మహా యజ్ఞం ప్రారంభం

తరలి రానున్న ప్రముఖులు వేద పండితులు

108 కుండాళలతో ఏర్పాట్లు

శివ్వంపేట అక్టోబర్ 24 వాయిస్ టుడే : భారతదేశంలోనే ప్రముఖ క్షేత్రంగా అనతి కాలంలోనే ప్రత్యేక గుర్తింపు పొంది, దేశ విదేశాల నుంచి ఇక్కడికి భక్తులు పెద్దసంఖ్యలో రప్పించుకొని, అనునిత్యం అమ్మవారిని దర్శించుకునే విధంగా భగలాముఖి శక్తి ఫిఠం ప్రాచుర్యం పొందినది అనీ చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. అటువంటి మహిమాన్వితమైన కోవెలలో ఈ నెల 25

అష్టోత్తర శత (108) కుండాత్మక శ్రీ బగళాముఖీ మహా మంత్రానుష్ఠాన మహాయాగం నిర్వహించేందుకు శ్రీ భగలముఖి చారిటబుల్ ట్రస్ట్ నిర్ణయించి, అందుకు తగినట్లుగా బహువిధములైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఏకకాలంలో సుమారు 50 మంది వేద పండితుల మంత్రోచ్ఛరల మధ్య 108 జంటలు శ్రీబగళాముఖీ యాగంలో పాల్గొని వారి చేత ఈ మహా యజ్ఞం నిర్వహించేందుకు శక్తి పీఠ వ్యవస్థాపకులు, శ్రీ విద్యా ఉపాసకులు శాస్త్రుల లక్ష్మీవేంకటేశ్వరశర్మ సారథ్యంలో గదా రెండు రోజుల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా

అమ్మవారి ఉపాసకులు వెంకటేశ్వర శర్మ మాట్లాడుతూ లోకకల్యాణార్థము ఆదివారం ఉదయం 8 గంటలకు

అష్టోత్తరశత (108) కుండాత్మక శ్రీ బగళాముఖీ మహా మంత్రానుష్ఠాన మహాయజ్ఞము ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. యాగానికి సంబంధించిన విశిష్టత ఆయన తెలియజేశారు. శారీరక, మానసిక, కుటుంబ, ఋణబాధా, శత్రుబాధా, న్యాయ సంబంధ, వ్యాపార, ఉద్యోగ, రాజకీయాది అనేక బాధలనుండి నివృత్తికై స్వయంగా శ్రీబగలాముఖీ మహా నామ మంత్ర మహాయజ్ఞంలో పాల్గొని భక్తులు మన వారి జీవితల్లో కొత్త వెలుగులు నింపుకోవడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమం ఉదయం 8గంటలకు ప్రారంభం అవుతుందని, తప్పనిసరిగా సూచించిన సమయానికి ముందే సాంప్రదాయ వస్త్రాలతో భక్తులు దేవాలయానికి చేరుకోని మీకు కేటాయించిన స్థలములో కూర్చోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే యజ్ఞములో పాల్గొనే భక్తులకు పూజా సామాగ్రి దేవస్థానం నుండి ఇవ్వబడుతుందని, వారికీ అల్పాహారం అన్నప్రసాదం ఉంటుందని చెప్పారు. ఈ యాగంలో క్రింద కూర్చోవడం ఇబ్బంది ఉన్న వారు వచ్చేటప్పుడు చిన్న స్టూల్స్ తెచ్చుకోవాలని సూచించారు. ఈ మహా యజ్ఞం ముగిసిన తర్వాత అమ్మవారి పసుపు, యజ్ఞ విభూతి భక్తులకు ప్రసాదముగా ఇవ్వబడుతుందని చెప్పారు. అయితే సంవత్సరంలో ఒకసారి మాత్రమే ఈ మహా యజ్ఞం జరుగుతుందని, ఈ యజ్ఞములో తప్పక పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని తెలియజేశారు. నిర్ణయిత సమయానికి ముందుగా వచ్చే దంపతులు వారి పేర్లు నమోదు చేసుకునే వారికే అవకాశం ఉంటుందని వెంకటేశ్వర శర్మ తెలిపారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

మట్టె వాడ ఇన్స్పెక్టర్ ఎన్. కరుణాకర్

వరంగల్(వాయిస్ టుడే) అక్టోబర్ 24 : రాబోయే దీపావళి పండుగను పురస్కరించుకుని, మట్వాడా పోలీస్ స్టేషన్ పరిధిలో ముందస్తు అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా నిల్వ చేసినా, విక్రయించినా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మట్వాడా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎన్. కరుణాకర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ, దీపావళి పండుగ సమయంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. బాణసంచా విక్రయించాలనుకునే వ్యాపారులు సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. అలాగే, నివాస ప్రాంతాల్లో లేదా అనుమతి లేని ప్రదేశాల్లో బాణసంచా నిల్వ చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి బాణసంచా నిల్వ చేసినా, విక్రయించినా గుర్తించి, నిబంధనల ప్రకారం సరుకును స్వాధీనం చేసుకోవడంతో పాటు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు, వ్యాపారులు పోలీసులకు సహకరించి, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ సురక్షితమైన వాతావరణంలో దీపావళి పండుగను జరుపుకోవాలని ఇన్స్పెక్టర్ ఎన్. కరుణాకర్ కోరారు.

ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థికి తిరుపతిరెడ్డి చేయూత

తొర్రూరు, అక్టోబర్ 24 వాయిస్ టుడే : తొర్రూరు పట్టణ కేంద్రానికి చెందిన చెరుకు లక్ష్మి-సంజీవ కుమారుడు ఉమేష్ చంద్ర మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ఐఐటీలో సీటు సాధించిన సందర్భంగా వారి తల్లిదండ్రులకు శనివారం తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఉమేష్ చంద్ర తన ఉన్నత చదువులను పూర్తి చేసుకునే వరకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. నిరుపేద విద్యార్థి భవిష్యత్తుకు అండగా నిలిచి,ఉన్నత విద్యను ప్రోత్సహించాలన్నారు. ఉమేష్ చంద్ర భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తన తల్లిదండ్రులకు,తొర్రూరు పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం దొంతోజు కిరణ్, వంశీ ఉమేష్ చంద్ర ను అభినందించారు.

రైతులు ఆరుతడి పంటల సాగుపై మొగ్గుచూపాలి: ఏఈఓ అన్వేష్

శాయంపేట(వాయిస్ టుడే): మైలారం గ్రామంలో ఏఇఓ అన్వేష్ ఆధ్వర్యంలో రైతులకు లిఖేతి భచావో అభియాన్‌లి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది.ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా పడకపోవడంతో యాసంగి సీజన్‌లో రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే పప్పు దినుసులు, నూనె గింజలు, ఇతర ఆరుతడి పంటలను వేసుకోవాలని తెలిపారు. పంటలు కోసిన తర్వాత వాటి అవశేషాలు, పంట వ్యర్థాలను తగలబెట్టడం చట్టరీత్యా నేరమని, వాటిని భూమిలోనే కలుపుకోవాలని సూచించారు.రైతులు మట్టి పరీక్షలు చేయించుకుని, వాటి ఆధారంగా మాత్రమే ఎరువులను వాడాలని తెలిపారు. దీనివల్ల ఖర్చు తగ్గడమే కాకుండా భూమి చౌడుబారకుండా, నేల ఆరోగ్యం మెరుగుపడి దిగుబడి పెంచుకోవచ్చని సూచించారు.పంటలకు కాలువల ద్వారా కాకుండా డ్రిప్ (బిందు సేద్యం) లేదా స్ప్రింక్లర్ ద్వారా నీరు అందించాలని, తద్వారా నీటి ఆదా, ఖర్చు తగ్గడం, దిగుబడి పెరగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మసికె కుమారస్వామి,ఆత్మ కమిటీ మెంబర్ దూదిపాల నర్సింహారెడ్డి,రైతులు పాల్గొన్నారు.

ఎంపివో కి వినతిపత్రం అందజేసిన సీఐటీయూ మండల నాయకులు

ముదిగొండ మండలం అక్టోబర్ 24 వాయిస్ టుడే : అక్టోబర్ 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం ముదిగొండ మండల ఎంపీఓ (MPO) రామకృష్ణకు సీఐటీయూ (CITU) మండల నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ... కార్మికులు మరియు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న ఇందిరా పార్క్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో సీఐటీయూ మండల నాయకులు ఎస్.కె. హుస్సేన్, ఇరుకు రాము, పల్లెపొంగు రవి, పల్లపాటి శ్రీకాంత్, ఉపేందర్, నాగేశ్వరరావు, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

గట్టేపల్లి హనుమాన్ ఆలయానికి బోర్‌వెల్ సౌకర్యం ఏర్పాటు

- ఎంపీ గడ్డం వంశీకృష్ణ నిధుల నుంచి రెండు లక్షల మంజూరు

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా అక్టోబర్-24 వాయిస్ టుడే: పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ఎంపీ నిధుల నుంచి మంజూరైన రెండు లక్షల రూపాయల వ్యయంతో సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న హనుమాన్ దేవాలయానికి ఏర్పాటు చేసిన బోర్‌వెల్ మోటార్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులకు, దేవాలయ అవసరాలకు నీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ బోర్‌వెల్ మోటార్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయానికి నీటి సౌకర్యం కల్పించేందుకు ఎంపీ నిధుల నుంచి రెండు లక్షలు మంజూరు కావడంతో బోర్‌వెల్ మోటార్‌ను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో ఆలయ అవసరాలకు నీటి సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నీరటి శంకర్, గట్టేపల్లి గ్రామ సర్పంచ్ గుండేటి దేవేందర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మూల సత్యం, మత్స్య పారిశ్రామిక సంఘం గ్రామ అధ్యక్షుడు ఐలవేణి వీరస్వామి, ఈర్ల రమేష్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.హనుమాన్ దేవాలయానికి బోర్‌వెల్ మోటార్ మంజూరు కావడానికి సహకరించిన ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నీరటి శంకర్‌కు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పన కు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

దిమ్మదుర్తి ఎస్సార్ఎస్పీ క్వార్టర్స్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)అక్టోబర్ 24: నిర్మల్ జిల్లా దిమ్మదుర్తి గ్రామంలో ఎస్సార్ఎస్పీ క్వార్టర్స్‌లో గత కొన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటున్న కుటుంబాల సమస్యలను తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా కుటుంబాలకు ఇందిరమ్మ కాలనీలో స్థలాలు కేటాయించే అంశంపై సంబంధిత అధికారులతో చర్చించి, నివాసితుల సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరిరావు గారితో పాటు ఎమ్మార్వో, తహసీల్దార్, హౌసింగ్, ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సర్వపిండిపై చర్చ

సరికొత్త నినాదంతో ముందుకెళ్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా.చింతం ప్రవీణ్ కుమార్

వరంగల్ (వాయిస్ టుడే) అక్టోబర్ 24 : వరంగల్ నల్గొండ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా.చింతం ప్రవీణ్ కుమార్ ప్రచారాన్ని వినూత్నంగా కొనసాగిస్తున్నారు. తెలంగాణ బ్రాండ్ పిండి వంటకం సర్వ పిండి తో తన ప్రచారానికి స్వీకారం చుట్టారు. ప్రవీణ్ కుమార్. శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో సర్వపిండి పై చర్చ అనే నినాదాన్ని ఆయన ప్రారంభించారు. దీని ద్వారా గ్రౌండ్ లెవెల్ కి బలంగా వెళ్లాలనే ఆలోచన చేస్తున్నారు ప్రవీణ్ కుమార్ చింతం. చాయ్ పై చర్చ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఎంత ప్రఖ్యాతి గాంచింది. తెలిసిన విషయమే, అదే విధంగా సర్వపిండి పై చర్చ కూడా అదే విధంగా ప్రజల్లోకి బలంగా వెళ్లి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా విద్యారంగ రాజకీయ సమస్యలను చర్చ పెట్టాలనేదే తన ప్రధాన ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.డాక్టర్ పాక శ్రీధర్,చింతం రాజేశ్వర్,జంగిలి దేవరాజు,మట్ట దుర్గాప్రసాద్, చింతల అనిల్,గోసుల ఆనంద్,తిరుపతి నాయక్, బోడకుంట్ల రవి కుమార్, కెత్త జయశంకర్, చింతం అమర్ వర్మ,వీరబత్తిని శ్యాం సుందర్,వడ్డే శ్రీనివాస్,రుద్ర శ్రీనివాస్,దీపక్ వరియల్,మేకల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన గంజాయిని ధ్వంసం చేసిన పోలీసులు

వరంగల్ (వాయిస్ టుడే) అక్టోబర్ 24 : తెలంగాణా యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ ఆదేశాల మేరకు, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 106 కేసులకు సంబంధించి, స్వాధీనం చేసుకున్న 967.864 కిలోల గంజాయిని, సుమారు రూ. 4,83,93,200 (రూ.4.83 కోట్ల) విలువైన గంజాయిని, డ్రగ్ డిస్పోజల్ కమిటీ వారు నిబంధనల ప్రకారం ధ్వంసం చేశారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఆధ్వర్యంలో, శనివారం నాడు హనుమకొండ మండల పరిధిలో నీ అమ్మవారిపేట గ్రామ శివారులో ఉన్న కాకతీయ మెడిక్లీన్ సర్విస్ వారి భస్మీకరణ ప్లాంట్ లో గంజాయి ధ్వంస కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ నిరంతరం చర్యలు చేపడుతోందని, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటూ, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి పోలీస్ శాఖ కృషి చేస్తోందని డీసీపీ అంకిత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ(పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, సీసీఆర్బీ ఏసీపీ డేవిడ్ రాజు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాపరబోయిన శ్రీదుర్గ మృతి బాధాకరం

శ్రీదుర్గ పేరు మీద సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలి

టిజిఎస్ రాష్ట టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర

వరంగల్ (వాయిస్ టుడే) అక్టోబర్ 24 :వరంగల్(వాయిస్ టుడే) అక్టోబర్ 23: వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ కార్యదర్శి పారిపెల్లి రాజేంద్రకుమార్ గంగపుత్ర కుమార్తె కాపరబోయిన శ్రీ దుర్గ గంగపుత్ర అనారోగ్య సమస్యతో మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర అన్నారు. శ్రీదుర్గ మృతి విషయం తెలుసుకున్న ఆయన, వరంగల్‌లోని పారిపెల్లి రాజేంద్రకుమార్ గంగపుత్ర నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. అనంతరం టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ, చిన్న వయసులోనే శ్రీ దుర్గ మృతి చెందడం అత్యంత బాధాకరమని, ఆమె మరణం కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి గంగపుత్ర సంఘం అండగా ఉంటుందని తెలిపారు. శ్రీదుర్గ జ్ఞాపకార్థం రానున్న రోజుల్లో ఆమె పేరు మీద పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని ఆయన ప్రకటించారు. సమాజానికి సేవ చేయడం ద్వారా శ్రీ దుర్గ జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు మరోసారి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, శ్రీ దుర్గ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

కళాక్షి ఫెస్టివల్‌లో ఆర్టిస్ట్ ఐశ్వర్య

హన్మకొండ (వాయిస్ టుడే) 24 అక్టోబర్ : బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో నిర్వహిస్తున్న కళాక్షి ఫెస్టివల్ ఎడిషన్ టు లో భాగంగా వివిధ కళాకృతులు ఏర్పాటు చేయగా నామాని ఐశ్వర్య అద్భుతమైనటువంటి కళాకృతులను ఆవిష్కరించింది. శనివారం ఉదయం 11 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ రకాల బొమ్మలను గీసి ప్రదర్శనలో ఉంచింది. అంతేకాక కళాకృతులను ఆకట్టుకున్న ఆహుతులు కొంతమంది వీటిని కొనుగోలు కూడా చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఆర్టిస్ట్ నామాని ఐశ్వర్య మాట్లాడుతూ చిన్ననాటి నుండి బొమ్మల గీయడం చాలా ఆసక్తిగా ఉండేదని తమ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తను ఈ స్థాయికి వచ్చానని తెలియజేసింది. ఈ కార్యక్రమం కాలోజీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కళాక్షి ఫౌండేషన్ వారికి రాష్ట్ర ప్రభుత్వానికి ఐశ్వర్య ఈ సందర్బంగా తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ఆర్టిస్ట్ ఐశ్వర్యతో పాటు తల్లిదండ్రులు సాంబయ్య రమాదేవి పాల్గొన్నారు.

వాయిస్ VOICE OF PRAJALU
హైదరాబాద్
ఆదివారం 25 అక్టోబరు 2026

గుడుంబా తయారీపై నర్సాపూర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ దాడులు

అక్రమ బెల్ట్‌షాపులపై కేసులు నమోదు.. డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్

నర్సాపూర్ (వాయిస్ టుడే) : ఎక్సైజ్ శాఖ, ఎవిఘని ఎఱిజఙంఅశీఅ అలాగే జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి ఎవిఘని ఎఱఆఅఊఙష ఆదేశాల మేరకు నర్సాపూర్ ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు, దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా శివంపేట మండలంలోని ఙఊజుఎఱఊఅఎఊ గ్రామ సమీపంలోని భీమ్లా తండా పరిసర ప్రాంతంలో అక్రమంగా గుడుంబా (నాటుసారా) తయారు చేస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక నిందితుడిని అరెస్టు చేసి, 2 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 30 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అలాగే, అధికారికంగా ఐఎంఎల్ మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు రెండు బెల్ట్‌షాపులపై తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి రెండు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా 4.32 లీటర్ల ఐఎంఎల్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గులాం ముస్తఫా పర్యవేక్షణలో, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ట్రైనీ ఇన్‌స్పెక్టర్ జ్ఞానేశ్వర్, ఎస్ఐ డి. శరత్ కుమార్, ట్రైనీ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సదిరథ, ఎక్సైజ్ సిబ్బంది రవి, హెడ్ కానిస్టేబుల్ స్వామి, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు మహేశ్ కుమార్, షాహిద్, రాజశేఖర్ తదితరుల భాగస్వామ్యంతో నిర్వహించబడ్డాయి. అక్రమ మద్యం తయారీ, విక్రయాలు మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు.

థాంగ్-టా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

- జాతీయ స్థాయికి సనా తబసుమ్, మనోజ్ కార్తి ఎంపిక
- విజేతలను అభినందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 24 వాయిస్ టుడే: రాష్ట్రస్థాయి థాంగ్-టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో పతకాలు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సనా తబసుమ్, మనోజ్ కార్తిని ప్రత్యేకంగా ప్రశంసించారు.ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి థాంగ్-టా పోటీల్లో పాఠశాల విద్యార్థులు పలు పతకాలు సాధించారు. అండర్ పదిహేడు సంవత్సరాల బాలుర విభాగంలో మనోజ్ కార్తి నలభై ఎనిమిది కిలోల కేటగిరీలో బంగారు పతకం సాధించగా, సంప్రీత్ యాభై రెండు కిలోలు, అద్వైత్ యాభై ఆరు కిలోలు, సాత్విక్ డెబ్బై ఐదు కిలోల విభాగాల్లో రజత పతకాలు గెలుచుకున్నారు.అదేవిధంగా అండర్-17 బాలికల విభాగంలో కృతిక డెబ్బై ఐదు కిలోల కేటగిరీలో రజత పతకం, శ్రీ వర్షిణి నలభై ఎనిమిది కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించారు. అండర్-14 బాలికల విభాగంలో సనా తబసుమ్ నలభై ఒకటి కిలోల కేటగిరీలో బంగారు పతకం కైవసం చేసుకుంది. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన సనా తబసుమ్, మనోజ్ కార్తి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.విద్యార్థులు సాధించిన విజయాల పట్ల పాఠశాల చైర్మన్ మాట్లాడి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణప్రియ, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు..

పట్టభద్రుల ఓట్ల నమోదును వేగవంతం చేయాలి

బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి

భద్రాచలం, అక్టోబర్ 24 : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని కాంటెస్టెడ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి సూచించారు. భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల ప్రాంతాలకు చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ఓటర్ల నమోదుకు సంబంధించిన నిబంధనలు, అవసరమైన ధ్రువపత్రాలపై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేలా చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు.
భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల ప్రాంతాల్లోని ముఖ్య కార్యకర్తలు గ్రామాలు, పట్టణాల్లో పట్టభద్రులను గుర్తించి, ఓటర్ల నమోదు ప్రక్రియలో వారికి సహకరించాలని అన్నారు. నమోదు కార్యక్రమాన్ని క్రమబద్ధంగా నిర్వహిస్తూ, అర్హులైన పట్టభద్రులెవరూ ఓటు హక్కు పొందే అవకాశాన్ని కోల్పోకుండా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి రావులపల్లి రాంప్రసాద్, సీనియర్ నాయకులు మానే రామకృష్ణ, దుమ్ముగూడెం భద్రాచలం చర్ల మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 24: నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో కట్టా రామకృష్ణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య, హాజరు శాతాన్ని పరిశీలించారు. వంటగది, విద్యార్థుల గదులను సందర్శించి వసతి గృహంలో అందుతున్న సౌకర్యాల గురించి హాస్టల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.
విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల సంక్షేమం, వసతి గృహం నిర్వహణపై ప్రత్యేక దృష్టి వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాథోడ్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

నూతన అదనపు కలెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిసిన ఆప్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 24: నిర్మల్: నిర్మల్ జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్లు (రెవెన్యూ, లోకల్ బాడీ)ను ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అదనపు కలెక్టర్లు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆప్ జిల్లా జనరల్ సెక్రటరీ సి.హెచ్. వినోద్, ట్రెజరర్ అబ్దుల్ సాధిక్, టౌన్ ప్రెసిడెంట్ రవి, అధికార ప్రతినిధి వసంత్ రావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మెరుగు రాజన్న, బొక్కాల భూమన్న, లాయర్ అరవింద్, షేక్ ఇమామ్, షేక్ షాదుల్లా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలి ఖానాపూర్ ఎమ్మెల్యే

ప్రజా ప్రభుత్వం గంజాయ్,డ్రగ్స్ అరికట్టేందుకు ఈగల్ టీం ఏర్పాటు చేసింది వెడ్మ బొజ్జు పటేల్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)అక్టోబర్ 24: ఉట్నూర్ మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్లో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువతకు అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల్ డీసీసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ యువతను ఉద్దేశించి ప్రసంగించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలి,దురలవాటులతో యువకులు జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు.ఉన్నత లక్ష్యంతో కష్టపడి ఎదిగి తల్లి తండ్రులకు అండగా నిలుస్తూ సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో గంజాయ్,డ్రగ్స్ అరికట్టేందుకు ఈగల్ అనే ప్రత్యేక బృందం పని చేస్తుంది అని.యువతను మంచి మార్గంలో నడిపిస్తూ మంచి భవిష్యత్ కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని ఆయన అన్నారు.యువతకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు.కార్యక్రమ నిర్వాహకులు ఎమ్మెల్యే ని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు,మరియు సామాజిక కార్యకర్త ముంతాజ్,కాంగ్రెస్ నాయకులు అన్సారీ, ఫహీమ్,పెద్దలు,యువకులు పాల్గొన్నారు

వానల్ పహాడ్ గ్రామంలో నీటి సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)అక్టోబర్ 24: నిర్మల్ జిల్లాలోని వానల్ పహాడ్ గ్రామంలో శనివారం నీటి పొదుపు మరియు భూగర్భ జలాల పెంపు పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వృధా నీటిని అరికట్టడం మరియు ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేసే పద్ధతులపై గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగలక్ష్మి వినోద్ ఉపసర్పంచ్ సాయా రెడ్డి సెక్రటరీ గాయత్రి కారాబార్ నారాయణ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొని నీటి సంరక్షణలో భాగ్య స్వాములయ్యారు.

హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డిని సన్మానించిన ముదిరాజ్ సంఘం ప్రతినిధులు

నర్సాపూర్ (వాయిస్ టుడే) : హత్నూర మండల్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నాడు హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి గారిని హత్నూర పోలీస్ స్టేషన్లో మర్యాదపూర్వ కలిసి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు ఈ సందర్భంగా హత్నూర మండల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తలారి రాజేందర్ మాట్లాడుతూ ఈనెల 22న జరిగిన పండుగ సాయన్న జయంతి వేడుకలు విజయవంతం కావడానికి పోలీస్ శాఖ ద్వారా అందించిన సహకారానికి గుర్తుగా ఈ సన్మానం చేశామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో హత్నూర మండల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తలారి రాజేందర్ కాసాల కొటాల వెంకటేశం లింగాపూర్ సర్పంచ్ మణిదీప్ పల్పనూరు సర్పంచ్ ఆంజనేయులు ముదిరాజ్ సంఘం నాయకులు దుర్గయ్య రవి తలారి యాదగిరి పన్యాల రాజు హత్నూర యాదగిరి పాల్గొన్నారు.

ముచ్చర్ల గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన సర్పంచ్ యాదగిరి

నర్సాపూర్ (వాయిస్ టుడే) : హత్నూర మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ముచ్చర్ల సర్పంచ్ యాదగిరి ప్రారంభించారు ఎఐఎన్ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చొరవతో గ్రామ శివారులో గల వేక పరిశ్రమ నుండి సి ఎస్ ఆర్ నిధులు ఐదు లక్షల సాయంతో చేపట్టనున్నాయి పనులకు ఆయన భూమి పూజ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఆర్థిక సహకారం అందిస్తున్న పరిశ్రమ యాజమాన్యానికి పరిశ్రమ ప్రతినిధులకు సర్పంచ్ తో పాటు గ్రామ పాలకవర్గ సభ్యులు సహకారం ఎల్లప్పుడూ పరిశ్రమకు ఉంటుందని గ్రామస్తుల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో లైఫ్ ఇన్సూరెన్స్ భవనానికి స్థలం కేటాయించాలి

జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్‌కు వినతిపత్రం అందజేత

జహీరాబాద్ (వాయిస్ టుడే) అక్టోబర్ 24: లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐఎఎఫ్ఐ) భవన నిర్మాణం కోసం జహీరాబాద్‌లో తగిన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సంస్థ ప్రతినిధులు స్థానిక పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. జహీరాబాద్‌లో ఎల్ఐఎఎఫ్ఐ భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తే బీమా ఏజెంట్ల సమావేశాలు, సంస్థాగత కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఎంతగానో సౌకర్యంగా ఉంటుందని వివరించారు. బీమా ఏజెంట్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని భవన నిర్మాణానికి స్థలం కేటాయించేలా చొరవ తీసుకోవాలని ఎంపీని కోరారు..?దీనిపై ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐఎఎఫ్ఐ జహీరాబాద్, నారాయణఖేడ్ శాఖ అధ్యక్షుడు ఈ. విఠల్ గౌడ్, కోశాధికారి పోలీస్ ప్రవీణ్ పాటిల్, సీనియర్ ఏజెంట్లు నాగయ్య, పరమేశ్వర్ పాటిల్, ఎస్.హెచ్. బాబూజీతో పాటు పలువురు బీమా ఏజెంట్లు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజ నిర్మాణమే మనందరి లక్ష్యం!

ప్రతి ఒక్కరూ పోలియోపై అవగాహన కలిగి ఉండాలి
ఝరాసంగం ఐదో వార్డు సభ్యుడు ఎండీ ఇస్మాయిల్

జహీరాబాద్ ,వాయిస్ టుడే అక్టోబర్ 24 : పోలియో రహిత సమాజ నిర్మాణమే మనందరి లక్ష్యమని ఝరాసంగం ఐదో వార్డు సభ్యుడు ఎండీ ఇస్మాయిల్ అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ప్రజలందరూ పోలియో వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోలియో వ్యాధి చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదకరమైన అంటువ్యాధి అని, దీనిని నివారించడంలో పోలియో టీకాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వం సూచించిన టీకాల షెడ్యూల్ ప్రకారం తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.
ప్రభుత్వం నిర్వహించే పోలియో టీకాల కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్య సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించినప్పుడే పోలియో నిర్మూలన లక్ష్యాన్ని సాధించగలమని ఎండీ ఇస్మాయిల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**